

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

19 వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం,8 డిశంబర్ 2025

8 పేజీలు






## కిక్కిరిసిన నడిబొడ్డున

# అర్ధరాత్రి 'అక్రమ'సవాల్ !

- అధికారుల కళ్లుగప్పి అనుమతులు లేని అంతస్తులు నిర్మాణం
- ఈ తెగింపు వెనుక ఉన్న "దన్ను" ఎవరిది?
- కమిషనర్ సత్యనారాయణ పనితీరుకు ఈ సంఘటనే కొలమానమా?
- అక్రమ కట్టడాల కూల్చివేతకు సెక్షన్ల ఆయుధం సిద్ధమా?
- బిపిఎస్‌కు అర్హత లేకపోయినా ఇంత బరితెగింపా ?




కాకినాడ నగరంలో ప్రజలు,అధికారుల నిద్రావస్థను ఆసరాగా తీసుకుని డిసెంబర్ 7వ తేదీ ఆదివారం అర్ధరాత్రి ఆ యజమాని చట్ట విరుద్ధ నిర్మాణాలకు పాల్పడ్డాడు.ఇప్పటికే సరైన అనుమతులు లేని పాత భవంతుకి తోడు కమర్షియల్ అద్దెలతో రోడ్డు మీద వాహనాలు నిలిపేలా పార్కింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసి ట్రాఫిక్కుకు ఇబ్బందులు సృష్టిస్తున్న భవన యజమాని ఇప్పుడు ఏకంగా మరో అంతస్తు నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేకుండా తెగించడం అత్యంత అరాచకంగా ప్రజలు విమర్శిస్తున్నారు. ఈఅక్రమ నిర్మాణంపై చర్యలకు ఉమ్మడి గోదావరిజిల్లాల సూర్యబ్యూరో అందించిన క్షేత్రస్థాయిలో పరిశీలనాత్మక కథనం...

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్యబ్యూరో

కాకినాడ నగరంలో అక్రమ నిర్మాణదారులు ఏకంగా నగరంలోని నడిబొడ్డున తమ బరితెగింపును ప్రదర్శించారు. అందరూ నిద్రిస్తున్న అర్ధరాత్రి వేళ, మునిసిపల్ అధికారుల కళ్లు గప్పి, నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్తుల నిర్మాణం చేపట్టారు. అనుమతులు లేకుండా జరుగుతున్న ఈ అక్రమ కట్టడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**అర్ధరాత్రి ఆపరేషన్! అధికారులు నిద్రలో ఉండగా..**సాధారణంగా పగటిపూట నిఘా ఉండేఅధికారులను తప్పించుకోవడానికి కొందరు

- తరువాయి 2లో..

# దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలకు పునరంకితమవుదాం

- శెట్టిబలిజల్లో ఆత్మగౌరవాన్ని నింపిన మహనీయుడు దొమ్మేటి
- "దొమ్మేటి " విగ్రహన్ని ఆవిష్కరించిన మంత్రి వాసంశెట్టి సుభాష్





**నరసాపురం,మేజర్‌న్యూస్:**శెట్టిబలిజల్లో ఆత్మగౌరవాన్ని నింపిన దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాల సాధనకు, జాతి ఐక్యతకు కృషిచేస్తానని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టిసుభాష్‌పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలోని 27వ వార్డులో శెట్టిబలిజ యువసేన ఆధ్వర్యంలో శ్రీరామ శెట్టిబలిజ సంఘం నూతనంగా ఏర్పాటు చేసిన శెట్టిబలిజల జాతిపిత దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని ఆదివారం మంత్రిసుభాష్, సంఘీయుల సమక్షంలో పండుగవాతావరణంలో ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ శెట్టిబలిజ జాతికోసం నిర్విరామంగా ఎనలేని కృషిచేసిన దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని తనచేతుల మీదుగా ఆవిష్కరించడం పూర్వజన్మ సుకృతంగా పేర్కొన్నారు.ఇది కేవలం ఒక విగ్రహ ఆవిష్కరణ మాత్రమేకాదని మన సమాజం చరిత్రలో ఒకగొప్పరోజని,

- తరువాయి 2లో..

# సైకిల్ ర్యాలీతో 'డ్రగ్స్ వద్దు బ్రో - సైకిల్ తొక్కు బ్రో' నినాదం

- వేలాదిమంది విద్యార్థులతో
కాకినాడ వీధుల్లో ఎస్పీ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన





**కాకినాడ,మేజర్‌న్యూస్ :** నేటి యువత డ్రగ్స్ ఉచ్చులో పడకుండాఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునేలాప్రోత్సహించడానికి,ఫిట్ఇండియా కార్యక్రమంలో భాగంగా కాకినాడ జిల్లా పోలీసులు భారీ సైకిల్ ర్యాలీని నిర్వహించారు. 'డ్రగ్స్ వద్దు బ్రో – సైకిల్ తొక్కు బ్రో' అనే నినాదంతో నిర్వహించిన ఈ ర్యాలీకి జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ స్వయంగా నాయకత్వం వహించారు. ఆదివారం మధ్యాహ్నం ప్రారంభమైన ఈ ర్యాలీలో సుమారు1000మందికిపైగా విద్యార్థినీ విద్యార్థులు,పోలీసు సిబ్బంది మరియు ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కాకినాడలోని ఓల్డ్ పోలీస్ ఆఫీసు పెరేడ్ గ్రౌండ్‌లోనుంచి ఈ ర్యాలీ బయలుదేరి భానుగడి జంక్షన్, ఫ్లైఓవర్, మెయిన్‌రోడ్డు మీదుగా సాగి, బాలాజీ చెరువువద్ద ముగిసింది.ఈ సందర్భంగా ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ యువత డ్రగ్స్ వంటి దురలవాట్లకు

- తరువాయి 2లో..

# రూ.3 కోట్లతో భీమవరం,ఆచంటలో డయాలసిస్ సెంటర్లు





**– నిర్మాణ పనులు ప్రారంభించిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ**

**– 6 నెలలో నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశం**

**– త్వరలో రూ.4 కోట్లతో మొబైల్ క్యాన్సర్ టెస్టింగ్ వ్యాన్**

**భీమవరం,మేజర్‌న్యూస్:** ప్రజలకు అత్యవసర వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగా కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చొరవతో భీమవరం, ఆచంటలలో అత్యాధునిక ప్రభుత్వ డయాలసిస్ విభాగాల నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు.రెండుచోట్ల కేంద్రమంత్రి శ్రీనివాస వర్మస్వయంగా నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా భీమవరంలో ఏర్పాటు చేసిన సభలో కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ జిల్లాలో భీమవరం విద్య, వైద్య రంగాల్లో ముందున్నప్పటికీ ప్రభుత్వ రంగంలో డయాలసిస్ సెంటర్ లేకపోవడం దురదృష్టకరమని అన్నారు.ఈ సెంటర్ ఆరు నెలల్లో అందుబాటులోకి రానుందని, అత్యాధునిక డయాలసిస్ యంత్రాలతో కూడిన 10 బెడ్‌లను డయాలసిస్ రోగులకు ఉచిత చికిత్స కోసం అందుబాటులోకి వస్తాయని ప్రకటించారు. అవసరాన్ని బట్టి అదనపు బెడ్‌లను కూడా ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.నర్సాపురం పార్లమెంట్ పరిధిలోని డయాలసిస్‌సేవలుమరింత అందుబాటులోకి తీసుకువచ్చేం దుకు తాడేపల్లిగూడెం డయాలసిస్ సెంటర్‌లో అదనపు బెడ్ల కోసం రూ.2 కోట్లు, ఆచంట డయాలసిస్ సెంటర్ కోసం రూ.1కోటి,అత్తిలిలో డయాలసిస్ మిషన్లకు రూ.75లక్షలు సిఎస్ఆర్ నిధులను సమకూర్చినట్లు శ్రీనివాస వర్మ తెలిపారు.త్వరలో రూ.4 కోట్ల రూపాయల వ్యయంతో మొబైల్ క్యాన్సర్ టెస్టింగ్ వ్యాన్ అందుబాటులోకితీసుకురానున్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే,పి.ఎ.సి. చైర్మన్ పులపర్తి రామా ంజనేయులు (అంజిబాబు) మాట్లాడుతూ భీమవరంలో ప్రభుత్వ డయాలసిస్ సెంటర్ లేకపోవడంతో డయాలసిస్ పేషెంట్లు చికిత్స కోసం తాడేపల్లిగూడెం, తణుకు, ఏలూరు వెళ్లవలసి వస్తుందని, ప్రయాణంలో వారు పడుతున్న బాధ వర్ణనాతీతమని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి తాను కూడా పవన్ కళ్యాణ్ పేరు మీద సెంటర్ నిర్మిద్దామని భావిస్తున్న తరుణంలో, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ రెండు కోట్లసి.ఎస్.ఆర్ నిధులతో అత్యాధునిక డయాలసిస్‌సెంటర్‌ఏర్పాటుచేయడం అభినందనీయమ న్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నాగరాణి, డి.సి.హెచ్.ఎస్. డాక్టర్ పి.సూర్యనారాయణ, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మణ్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, బి.జె.పి.జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, బి.జె.పి. జిల్లా ప్రధాన కార్యదర్శి కలిదిండి వినోద్ వర్మ, జనసేన పార్టీ నాయకులు చంద్రశేఖర్, బండి రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆచంటలోని సిహెచ్సి ప్రైమరీ సెంటర్ వద్ద కోటి రూపాయలతో డయాలసిస్ విభాగం నిర్మాణ పనులను కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు.

ఒక కోటి రూపాయల సిఎస్ఆర్ నిధులతో డయాలసిస్ విభాగం నిర్మాణంతోపాటు మూడు అత్యాధునిక డయాలసిస్ యంత్రాలతో కూడిన బెడ్లు డయాలసిస్ పేషెంట్లకు అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యక్రమంలో ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## సైకిల్ ర్యాలీతో 'డ్రగ్స్ వద్దు బ్రో - సైకిల్ తొక్కు బ్రో' నినాదం

మొదటిపేజి తరువాయి

దూరంగా ఉండాలని, సైకిల్ తొక్కడం, క్రీడలు వంటి ఫిజికల్ యాక్టివిటీస్‌లో పాల్గొని శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తు తరాలు ఆరోగ్యంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆయన నొక్కి చెప్పారు. విద్యార్థులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినందు స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ కె.వి.సత్య నారాయణ ధన్యవాదాలు తెలిపారు. డ్రగ్స్ వ్యతిరేక సందేశాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో ఈ ర్యాలీ ముఖ్యపాత్ర పోషించింది. ఈ ర్యాలీ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంద, మేధావులు, నగర ప్రముఖులు, న్యాయవాదులు, మహిళలు,విద్యార్థినీవిద్యార్థులు పెద్దయెత్తున పాల్గొన్నారు.

## శ్రీ కోదండరామాలయ స్వామి వారి దేవస్థానంలో పంచామృత అభిషేకాలు

**జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్:**మండలంలోని రామచంద్ర పురం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కోదండరామాలయ స్వామి వారి దేవస్థానంలోఆదివారంస్వామివారి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రం సందర్భంగా గర్భగుడి లోని కృష్ణ శిల మూలవిరాట్టులకు పంచామృత అభిషేకములు నీరాజనం మంత్రపుష్పములు108వెండిపుష్పాలతో అష్టోత్త రము నిర్వహించటం జరిగిందిఈ పూజా కార్యక్రమం ఆలయ ప్రధాన అర్చకులుచే నిర్వహించారు.

# అఖండ అన్న సమారాధనతో ముగిసిన షష్ఠి మహోత్సవాలు





**ముదినేపల్లి,మేజర్‌న్యూస్ :** మండలంలోని సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లో వేంచేసియున్న శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి షష్ఠి కళ్యాణ మహోత్సవాలు అఖండ అన్న సమారాధనతో ముగిసాయి. ఈ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ను ఆలయ సహాయ కమిషనర్ రుద్రరాజు గంగా శ్రీదేవి , ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవికుమార్ ,ఆలయ అర్చకులు వేదమంత్రాలు,మంగళ వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు.శ్రీ స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మహా అన్న సమారాధనను ప్రారంభించి భక్తులకు వడ్డన చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి కన్వీనర్ వీరమల్లు నరసింహారావు , శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు , రాష్ట్ర రైతు నాయకులు చలసాని జగన్ మోహన్ రావు , నాయకులు వీరంకి వెంకటేశ్వరరావు, కొత్తూరు విఠల్ , కోడూరు శేషుబాబు, ఏఎన్ బాబు ,వడ్లాని ఆంజనేయులు ,పరసా ఏడుకొండలు,ఉత్సవ కమిటీ సభ్యులు ఉప్పలపాటి విమల, వడ్లమాని నాగలలిత,నీలం శివరమేష్ ,పరసా కృష్ణ ,బురుబోయిన సోవమ్మ, కొట్టి సుబ్బలక్ష్మి , దగాని నాగలక్ష్మి ,బెజవాడ నాగవెంకటరాధాకృష్ణ ,భట్టిప్రోలు నాగశిరీష , శొంఠి నాగకొండ, ఎన్డీఏ నాయకులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కిక్కిరిసిన నడిబొడ్డున అర్ధరాత్రి 'అక్రమ' సవాల్!

మొదటిపేజి తరువాయి



అక్రమనిర్మాణదారులు అర్ధరాత్రి సమయాన్ని ఎంచుకుంటున్నారు. ఈసంఘటనలో కూడా అదే జరిగింది. బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (బిఆర్ఎస్) మరియు బిల్డింగ్ పెనలైజేషన్ స్కీమ్‌లకు కట్-ఆఫ్ తేదీ ఆగస్టు 12గా నిర్ధారించిన తర్వాత కూడా ఈ అక్రమ నిర్మాణం కొనసాగించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రశ్న ఒక్కటే ..**ఈ అక్రమ కట్టడం వెనుక బలమైన రాజకీయ లేదా అధికారిక దన్ను ఉందా? అంత పెద్ద నిర్మాణాన్ని రహస్యంగా చేయగలిగే ధైర్యం ఎవరిచ్చారు? అక్రమాలకు చట్టం చెప్పే **శిక్ష ఇదే!** అనుమతులు లేని అక్రమ నిర్మాణాలపై మునిసిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవడానికి చట్టంలో స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. ఈ అక్రమ నిర్మాణాన్ని తొలగించడానికి అధికారులు ఉపయోగించగల కీలక సెక్షన్లు ఎలా ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్ టౌన్ ప్లానింగ్ చట్టం 1920 లోని సెక్షన్ 189 అనుమతి లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను నిలుపుదల చేయాలనే ఆదేశాలు జారీ చేయవచ్చు. ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ కార్పొరేషన్స్ చట్టం, 1955 లోని సెక్షన్ 452 ప్రకారం అక్రమ నిర్మాణాలను కూల్చివేసే అధికారాన్ని కమిషనర్‌కు ఇస్తుంది. కూల్చివేతకు అయ్యే ఖర్చును సదరు నిర్మాణదారుడి నుంచే వసూలు చేయవచ్చు. అదేవిధంగా ఈ చట్టంలోనే సెక్షన్ 461 ప్రకారం అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తే జరిమానాలు మరియు నేరం పునరావృతమైతే రోజువారీ పెనాల్టీలు విధించే అధికారం.

**కమిషనర్ సత్యనారాయణ పనితీరుకు పరీక్షా!**

నగరంలో అక్రమాలను అరికట్టే విషయంలో నూతన మునిసిపల్ కమిషనర్ సత్యనారాయణ పనితీరుపై నగర ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. నగరం నడిబొడ్డున జరిగిన ఈ 'అర్ధరాత్రి అక్రమం' ఆయన చిత్తశుద్ధికి, పరిపాలనా సామర్థ్యానికి నిజమైన కొలమానం కానుంది.అక్రమ కట్టడం విషయం తెలిసిన తర్వాత అధికారులు ఎంత వేగంగా, ఎంత కఠినంగా స్పందిస్తారు? కేవలం నిర్మాణాన్ని ఆపివేసి చేతులు దులుపుకుంటారా, లేక సెక్షన్ 452 ప్రకారం కూల్చివేతకు ఆదేశించి, భవిష్యత్తులో ఇలాంటి తెగింపులకు తావులేకుండా ఒకదృఢమైన సంకేతాన్నిఇస్తారాఅనేదివేచి చూడాలి. ప్రజల ఉత్కంఠ అంతాఇప్పుడుఅధికారులతక్షణ చర్యలపైనే ఉంది!.

## దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలకు పునరంకితమవుదాం

మొదటిపేజి తరువాయి

గౌరవానికి,ఐక్యతకు, స్వాభిమానానికి ప్రతీకగా అభివర్ణించారు. దొమ్మేటి వెంకటరెడ్డి శెట్టిబలిజల సామాజిక ఎదుగుదల కోసం తనజీవితాన్ని అంకితం చేసిన మహానుభావులని కీర్తించారు. స్వాతంత్ర సంగ్రామంలోనూ,శెట్టిబలిజల హక్కుల కోసం పోరాడిన నాయకుడని, సమాజంలో శెట్టిబలిజ జాతి అభ్యున్నతి ధ్యేయంగా కృషి చేశారన్నారు.ఇతర జాతులను గౌరవిస్తూనే శెట్టిబలిజ జాతిఐక్యతకు,ఆర్థిక,సామాజిక,రాజకీయ చైతన్యం కోసంకృషి చేస్తానన్నారు.ఈవిగ్రహం ఏర్పాటు ఆయన వ్యక్తిత్వానికే కాదని, ఆయన చూపించిన మార్గాన్ని అనుసరించాలనే మన సంకల్పానికి నిలువెత్తు సాక్ష్యంగా పేర్కొన్నారు. ఐక్యతనే నినాదంతో ఏకతాటిపై నడిస్తే ఏ లక్ష్యమైనా సాధించగలమన్నారు. జాతిపిత ఆశయాలను నెరవేర్చే దిశగా శెట్టి బలిజ యాక్షన్ ఫోర్స్ (ఎస్ఏఎఫ్) స్థాపించామ న్నారు. దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహ ఆవిష్కరణకు కృషి చేసిన అందరిని మంత్రి సుభాష్ ప్రత్యేకంగా అభినందించారు. విగ్రహ ఆవిష్కరణకు విచ్చేసిన మంత్రిసుభాష్‌కుభారీస్వాగతంతో ఊరేగిం పుగా తీసుకెళ్లి, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్,మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకిరామ్, గుత్తుల సాయి,టిడిపి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పుత్తూరు రామరాజు, నరసాపురం నియోజ వర్గం టిడిపి ఇన్చార్జి, పాలిక శ్రీనివాస్, గుబ్బల రాజేష్, గుత్తులవాసు, చెల్లుబోయిన వాసు, దొంగ పద్మారావు, శెట్టి బలిజ సంఘీయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ కుటుంబానికి ఆరోగ్య భద్రత కల్పించాలన్నదే ముఖ్యమంత్రి సంకల్పం





**- వారం, పది రోజుల్లోనే చెక్కుల పంపిణీ చేపట్టడం ఆనందదాయకం**
**- మొత్తం 40 మందికి రూ.17,92,681ల విలువైన చెక్కుల పంపిణీ**
**- కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**

**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలోని ప్రతీ కుటుంబానికి ఆరోగ్యభద్రత కల్పించాలనేదే ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. రావులపాలెం క్యాంపు కార్యాలయంలో ఆదివారం సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆత్రేయపురం 8 ఆలమూరు 14, కొత్తపేట 13, రావులపాలెం 5 మొత్తం 40మందికి రూ.17,92,681ల విలువైన చెక్కులను నేడు పంపిణీ చేశామన్నారు. ఎవరైనా తక్షణం వైద్యం చేయించుకోవాలనుకుంటే లెటర్ ఆఫ్ క్రెడిట్ క్రింద ఆసుపత్రి నుంచి ఎస్టిమేషన్ తీసుకువస్తే ఉదాహరణకు ఆసుపత్రి వారు రూ.5లక్షలు ఖర్చువుతుందని అంచనా వేస్తే ఆ లేఖ పట్టుకునివెళ్లి సీఎం సహాయనిధికి దరఖాస్తు చేస్తే ఎల్వోసీ కింద రూ.2.5 లక్షల వరకూ మంజూరు చేస్తున్నారని తెలిపారు. మరో విధానంలో ఆసుపత్రిలో ఖర్చుల బిల్లులు తీసుకెళితే వాటిని బట్టి వైద్యానికి ఇంత ఖర్చువుతుందనే అంచనాను బట్టి సహాయం మంజూరు చేస్తున్నారని తెలిపారు. మన నియోజకవర్గంలో ఎక్కువమందికి సీఎం చంద్రబాబు సహాయం అందిస్తున్నారని తెలిపారు. సీఎం సహాయనిధి కోసం ఎవరికి ఎటువంటి సహకారం కావల్సి ఉన్నా ఆఫీసులో సంప్రదించాలన్నారు. గత వైసిపి పాలనలో ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు అందేది కాదన్నారు. వాళ్లకు కావల్సినవారు ఒకరిద్దరికి తప్ప ఎవ్వరికీ మంజూరు అయిన పరిస్థితి లేదన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా, పేదలకు మేలు కలగాలనే తలంపుతో కోట్లాది రూపాయలు ముఖ్యమంత్రి సహాయంగా అందిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, గుత్తులరాంబాబు, కేతా శ్రీను, జక్కంపూడి బాలాజీ, కొప్పిశెట్టి ప్రసాద్, గనిశెట్టి వీరేష్ మరియు కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి కరాటే పోటీలో శ్రీ ఆదిత్య పాఠశాల విద్యార్థుల ప్రతిభ



**ఎటపాక, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల పరిధిలోని తోటపల్లి శ్రీ ఆదిత్య పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు డైరెక్టర్ వెంకట్, ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి తెలిపారు. తెలంగాణ పరిధిలోని ఖమ్మం జిల్లా కేంద్రంలో సుమన్ చోటకాన్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయస్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాఠశాల విద్యార్థులు సాయి అనన్య బ్లాక్‌బెల్ట్, రోహిత్ సిల్వర్ బెల్ట్, దీప్తి బ్రౌన్ బెల్ట్ కైవసం చేసుకున్నట్టు తెలిపారు. హీరో సుమన్ చేతులమీదుగా బహుమతులు అందుకున్నట్టు చెప్పారు. అల్లూరి జిల్లా నుంచి బ్లాక్ బెల్ట్ సాధించిన మొదటి విద్యార్థిగా సాయి అనన్య నిలిచిందని కోచ్ ముత్తు తేజ తెలిపారు. విద్యార్థుల ప్రతిభకు తల్లిదండ్రులు, మండలంలో పలువురు ప్రశంసల వర్షం కురిపించారు. పాఠశాలలో విద్యార్థులకు స్వీయరక్షణ కోసం గత పదేళ్ళపైగా శిక్షణ ఇస్తున్నామని వెంకట్ తెలిపారు. ఇటీవల సొసైటీలో మహిళలు, బాలికలు, విద్యార్థినులపై దాడులు పెరిగాయన్నారు. ఇందుకోసం ప్రత్యేక చర్యలు తీసుకొని కరాటే శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు.

# లూథరన్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో వంద మందికి నిత్యవసర సరుకులు పంపిణీ




**గోపాలపురం, మేజర్ న్యూస్ :** దేవుడైన యెహోవా ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని ఏసు క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని జగన్నాధపురం కెస్ట్రీ ఇవాంజలికల్ లూథరన్ మినిస్ట్రీ దైవజనులు జాన్ బాబు అన్నారు. జగన్నాధపురం గ్రామంలో క్రైస్ట్ ఇవాంజెలికల్ లూథరన్ మినిస్ట్రీ చర్చి వద్ద తుఫాన్ బాధితులకు ఆదివారం నిత్యవసరాలు సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాన్ మాట్లాడుతూ యేసు క్రీస్తు ఎన్నో ఏళ్ల జీవితంలో వారు బోధించిన ప్రతి మాటను ఇతరులకు ఆచరించి చూపిస్తే మార్గదర్శకం అందిస్తారని అన్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. తుఫాన్ కారణంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను ఆదుకున్న క్రైస్ట్ ఇవాంజలికల్ లూథరన్ మినిస్ట్రీ గుంటూరు శాఖ నుంచి నిత్యవసర సరుకులు పంపించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలు సంఘ కాపరి జాను బాబుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సచ్చితానంద, కోడూరి రఘురామ్, గమ్మిడి రాఘవయ్య, పసుమర్తి గంగాధర్, చర్చి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## వెంకన్న అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి నిత్య అన్నదాన పథకానికి ఆదివారం భీమవరం మండల గునుపూడికి చెందిన గూడూరు వీర వెంకట గోవర్ధన్, భారతి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.1,00,116లు విరాళంగా అందించారు. వీరికి అర్చకులు ఆలయం మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించి శేష వస్త్రములు సత్కరించారు. దాతలకు చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

## స్వచ్ఛ్‌భారత్ కార్యక్రమంలో పాల్గొన్న 'ఆదిత్య' విద్యార్థినులు






**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక సాంబమూర్తినగర్‌లో గల ఆదిత్య మహిళ డిగ్రీ మరియు పి.జీ కళాశాల ఎన్ ఎస్ ఎస్ విద్యార్థినులు స్వచ్ఛ్‌భారత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పార్క్‌లో శుభ్రత కార్యక్రమం నిర్వహించారని కళాశాల ప్రిన్సిపల్ కె.కరుణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జీ కళాశాలల అకడమిక్ డైరక్టర్ డా॥ బి.యి.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం పర్యావరణ పరిరక్షణ, పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించడం, ప్రజల్లో అవగాహన కల్పించడం అని తెలిపారు. ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కరుణ మాట్లాడుతూ పార్క్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, తినుబండారాల ప్యాకెట్లు వంటి మలినాలను మా విద్యార్థినులు సేకరించి శుభ్రపరిచారు. ప్రజల కోసం ఏర్పాటు చేసిన పార్క్‌లను శుభ్రంగా ఉంచడం మన అందరి బాధ్యత అని తెలిపారు. ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.నాగ శ్రీకాంత్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరు చొరవ తీసుకోవాలి. ఇలాంటి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగాలనేది "మా ఆకాంక్ష" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్.శ్రీనువాసరావు, అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.నవ్యమరియు అధిక సంఖ్యలో ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారు.

## నేడు 'పి.జి.ఆర్.ఎస్' నిర్వహణ - ఆర్డీఓ శ్రీరమణి



**పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ :** సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు నిర్వహణ జరుగుతుందని, ఆర్డీఓ కె.శ్రీరమణి తెలిపారు. కావున డివిజన్‌లోని 11మండలాల పరిధిలో గల ప్రజలు ఈ ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సద్వినియోగం చేసుకోవలసినదిగా ఆర్డీఓ తెలిపారు.

www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# ఘనంగా కుంతీదేవి ఉత్సవాలు



**గోపాలపురం,మేజర్‌న్యూస్ :** మండల ప్రధాన కేంద్రమైన గోపాలపురంలోని పెద్దగూడెంలో శ్రీ కుంతిదేవి అమ్మవారి వార్షిక మహెూత్సవాలు ఆదివారం ఘనంగా ముగిసాయి. ఉదయం నుండి అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఉత్సవాలను పురస్కరించుకుని గరగ నృత్యాలు, విచిత్ర వేషధారణలు, డప్పు వాయిద్యాలు వంటివి నిర్వాహకులు ఏర్పాటు చేశారు. సమాజంలోని కేవలం మాల కులస్తులు మాత్రమే కుంతీదేవి ఉత్సవాలను పూర్వకాలం నుండి సాంప్రదాయబద్ధంగా జరుపుకుంటూ ఉంటారు. దీనికి సంబంధించి పూర్వికులు ఒక పురాణ గాధను చెబుతూ ఉంటారు. కురుక్షేత్ర సంగ్రామం అనంతరం పాండవుల తల్లి పాండురాజు భార్య అయిన కుంతీదేవిని సమాజంలోని అష్టాది వర్ణముల వారు చేరదీయలేదు. దీంతో మానసిక వేదనకు గురైన కుంతీదేవి మాలల ఇండ్లకు చేరిందని చెబుతారు. తమ ఇంటికి వచ్చిన కుంతీదేవిని ఆ కులస్తులు ఆడబిడ్డగా భావించి చేరదీసారనేది గ్రామాల్లోని ప్రజల అభిప్రాయం. అత్తవారి ఇంటి దగ్గర ఉండే అమ్మవారిని ఉత్సవాల సందర్భంగా పుట్టింటి వారింటికి తీసుకురావడం ఆనవాయితీ. కాలనీ మధ్యలో అమ్మవారికి తాత్కాలికంగా నివాసయోగ్యం ఉండే పూరి గుడిసె ఏర్పాటు చేస్తారు. అక్కడ చిన్న గుంట తవ్వి దానిపై అమ్మవారిగా భావించిన కొత్త కుండను పెట్టి పసుపు రాసి కుంకుమ బొట్లు పెడతారు. దానిపై కొత్త చేటను బోర్లిస్తారు. ప్రతినిత్యం ఉదయం సాయంత్రం సమయంలో ఆవు పేడతో పరిసరాలను అలికి ముగ్గులు పెట్టి ధూప దీప నైవేద్యాలు సమర్పించి దాని చుట్టూ ప్రదక్షిణలు చేసి జానపద గీతాలు ఆలపిస్తారు. ఈ తరహాలో సుమారు నెలరోజులు పూజలు చేస్తారు. అనంతరం ఒక శుభ ముహూర్తంన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ధూప దీప నైవేద్యాలు సమర్పించి ఒక కొత్త బుట్టలో కుంతీదేవి అమ్మవారి మట్టితో తయారు చేసిన ఉత్సవ విగ్రహాన్ని నందీశ్వరుడు ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగిస్తారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, విచిత్ర వేషధారణలు బాణాసంచా కాల్పుల నడుమ అమ్మ వారి ఊరేగింపు అంగరంగ వైభవంగా జరుగుతుంది. అనంతరం అమ్మవారిని గ్రామంలోని ఊర చెరువులో నిమజ్జనం చేయడంతో పండుగ పూర్తయినట్లు అవుతుంది.

## సముద్ర తీర పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించిన ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల(స్వయం ప్రతిపత్తి) జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో స్వచ్ఛ సముద్ర తీర పరిశుభ్రత కార్యక్రమాన్ని కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఆదివారం సేవాకార్యక్రమాలలో భాగంగా స్వచ్ఛత కార్యక్రమాన్ని కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో నిర్వహించారు. 60 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు బృందాలుగా విడిపోయి జలచరాలకు ఇబ్బంది కలిగించే ప్లాస్టిక్ స్పూన్ లను, వలముక్కలను, ప్లాస్టిక్ వ్యర్థాలను, గాజు బాటిల్లను సేకరించారు. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, ఆవరణ వ్యవస్థను రక్షించాలని తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ విషయమై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించాలని అన్నారు. స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను అభినందించారు.

ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రజలలోకి తీసుకువెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని



నిర్వహించిన ఎన్ ఎస్ ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారులు టి తేజేశ్వరరావు, డి అశ్విని, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు

# పాడేరులో ఛలో కలెక్టరేట్

**- తరలివెళ్ళిన ఆదివాసీ సంక్షేమ పరిషత్ బృందం**



**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** రంపచోడవరం మండలం నర్సాపురం మెటల్ క్వారీపై అధికారులు దోబూచులాట తేల్చి, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ, ఈనెల 8వ తేదీన నిరసన కార్యక్రమం నిర్వహించేందుకు తరలివెళుతున్నామని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను ఆదివారం తెలిపారు. రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలోని నర్సాపురం సమీపంలో నల్లరాయి క్వారీవల్ల నష్టపోతున్న గిరిజన బాధితులకు న్యాయం చేయాలని అడిగినందుకు బాధితులపైన, అలాగే వారికి అండగా నిలబడిన ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులపైన దాడులుచేయడం, ఫిర్యాదు చేసిన కుటుంబాన్ని వెలివేయడాన్ని నిరసిస్తూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో పాడేరు కార్యాలయం ఎదుట శాంతియుత నిరసన తెలియజేస్తున్నట్లు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు కాకి మధు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ బృందం ఆదివారం పాడేరు జిల్లా కేంద్రానికి తరలి వెళుతున్నామన్నారు. నరసాపురం నల్లరాయి క్వారీ అంతా నల్లరాజ్యం ముసుగులో నడుస్తుందని, అన్నిరకాల అనుమతులు ఉన్నాయనే సాకుతో మైనింగ్ డిపార్ట్‌మెంట్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్, మైనింగ్ మాఫియాకు కొమ్ము కాస్తూ,ఆదివాసీ బాధితులపై కక్షపూరితంగా దాడులు చేస్తూ, నష్టపోతున్న బాధితులకు అన్యాయం చేస్తున్నారని వారు విమర్శించారు. న్యాయం కోసం శాంతియుతంగా ఉద్యమం చేస్తున్న బాధితులపైన, వారికి అండగా నిలబడిన ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులపైన కక్షపూరిత దాడులు చేస్తూ, పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తూ ఈసమస్యను తప్పుదోవ పట్టిస్తున్నారని వారు మండిపడ్డారు. ఈ విషయంలో అధికారులు జిల్లా కలెక్టర్‌కు తప్పుడు నివేదికలు ఇస్తూ సమస్యలు ఏమీ లేవంటూ తప్పించుకు ంటున్నారని, వీటన్నింటికీ కారకులైన అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమారం శాంతియుత నిరసన తెలియజేస్తున్నా మని, ఈ కార్యక్రమానికి మద్దతుగా ఆదివాసీలు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. రంపచోడవరం నియోజకవర్గంలో విచ్చలవిడిగా నడుస్తున్న మైనింగ్ కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను, జిల్లా అధ్యక్షులు తీగల బాబూరావు, మోడిద నూకరాజు, చోడి ఏడుకొండలరావు, ప్రదీప్ కుమార్ దొర, ప్రసాద్, పురుషోత్తం, గంగరాజు ఉన్నారు.

## శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు అన్నదానం

**- పాల్గొన్న భక్తులు**



పెద్దాపురం,మేజర్‌న్యూస్ : పెద్దాపురం పట్టణంలో వేంచేసి యున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయ లక్ష్మీ ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చు భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. దీనిలో భాగంగా అన్నదానంలో పాల్గొన్న భక్తుల బయోమెట్రిక్ హాజరును అసిస్టెంట్ కమీషనర్ విజయలక్ష్మీ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, అన్నప్రసాదం స్వీకరించారు. వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్ కుమార్, సిబ్బంది వెంకటరమణ, క్రాంతి వీర్, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్.ఎం.ఎస్. పరీక్షకు 1990 మంది హాజరు

**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండల పరిధిలో ఆదివారం నిర్వహించిన ఎన్.ఎం.ఎస్. పరీక్షకు 2075 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా, 1990 మంది హాజరైనట్లు డివైఇఓ ఈరంకి ప్రభాకర శర్మ ఒక ప్రకటనలో భాగంగా తెలిపారు. పెద్దాపురం పట్టణంలోని సాగర్ హైస్కూల్, జెఎన్ఎం, జిజిహెచ్ఎస్, ప్రతిభ, నారాయణ, లెమ్స్, శ్రీఆర్కా, విద్యానిధి, ఆదిత్య స్కూల్స్‌లో ఈ ఎన్.ఎం.ఎస్. పరీక్షలు నిర్వహించారు.

## కొండాలమ్మ ఆలయ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



**పెరవలి, మేజర్ న్యూస్ :** కానూరు గ్రామంలో శ్రీ.కొండలమ్మ తల్లి అమ్మవారి ఆలయం నందు డిసెంబర్ 7వ తేదీ ఆదివారం ఆలయ నూతన చైర్మన్,ధర్మకర్తల ప్రమాణ స్వీకార మహెూత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ హాజరై పాలకవర్గ సభ్యుల చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులతోపాటు గ్రామ జనసేన పార్టీ అధ్యక్షుడు రంకిరెడ్డి ప్రసాద్, కోలా సీతయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మురారి దుర్గమ్మ తిరునాళ్లకు పోటెత్తిన భక్తజనం

**- ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసిన సిఐ వై ఆర్ కే శ్రీనివాస్**

**- ముందస్తు జాగ్రత్తతో వైద్య సేవలు అందించిన ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ నరేష్**



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** గండేపల్లి మండలం మురారి పంట పొలాల్లో వేంచేసియున్న దుర్గమ్మ అమ్మవారి తిరునాళ్ల ఆదివారం ఘ నంగా ప్రారంభమైంది. ఈ తిరునాళ్లకు కోభాయ గోదావరి జిల్లాల నుండి అధిక సంఖ్యలో భక్తులకు చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. అలాగే భక్తులు వారి వారి మొక్కులను చెల్లించుకున్నారు. ఈ తిరుణాలలో భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జగ్గంపేట సీఐ వై ఆర్ కె శ్రీనివాస్ నేతృత్వంలో గండేపల్లి ఎస్సై శివ నాగబాబు గట్టి బందోబస్తు నిర్వహించారు.

అలాగే ముందస్తు జాగ్రత్తగా భక్తులకు వైద్యసేవాలందించేందుకు స్థానిక ప్రభుత్వ వైద్యాధికారి నరేష్ నేతృత్వంలో సిబ్బంది వైద్య సేవలు అందించారు. వచ్చిన భక్తులు అమ్మవారి ఆలయ చుట్టూ ఉన్న పంట పొలాల్లో వంట వార్పు నిర్వహించి భోజనాలు ముగించి అమ్మవారిని దర్శించుకుని వెళ్లారు.

# బాలల 'భవిత'కు భరోసా

**- విభిన్నం... ఆలోచిస్తే విజయం..**
**- ఈ నెల 9వ తేదిన భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పుట్టుకతో దివ్యాంగులుగా జన్మించినవారిని చూసి జాలిపడద్దు వారిలో ఇంకేదో ప్రతిభ దాగి ఉంటుంది. వారిని వెతకండి ప్రొత్సహించండి, అది తల్లితండ్రుల బాధ్యత అందుకు మీకు సాయంగా భవిత కేంద్రంలు ఉన్నాయి. భవిత కేంద్రాల ద్వారా విభిన్న ప్రతిభావంతులను గుర్తించి ప్రపంచానికి విజేతలుగా పరిచయం చేయడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. దీనిలో భాగంగా పెద్దాపురం పట్ట ణంలోని మహాత్మా గాంధి మున్సిపల్ స్కూల్‌లోని భవిత కేంద్రంలో సుమారు 22 మంది విద్యార్థులు, దివిలి కాలేజ్ హైస్కూల్ నందు 21 మంది విద్యార్థులు భవిత విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి జిల్లా విద్యాశాఖ, మరియు సమగ్ర శిక్షా, మండల విద్యాశాఖ అధికారులు ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు ప్రతీరోజు భవిత కేంద్రాల ద్వారా విద్యతో పాటు ఫిజియోథెరపి సేవలను అందజేస్తున్నారు. శారీరక, మానసిక వైకల్యంతో జన్మించిన చిన్నారుల భవితను తీర్చిదిద్దడంలో భవిత కేంద్రాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. చిన్నారులలో మానసిక స్థైర్యం నిలపడంతో పాటు చదువులో రాణించేలా ఈ కేంద్రాలలో పనిచేసే ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. చిన్నారుల ఎదుగుదలకు అవసరమైన సేవలను అందించడంతో పాటు ఫిజియోథెరపి సేవలను, స్పీచ్ థెరపి వారికి అవసరమైన ట్రైసైకిల్స్, కాలిపర్స్ వంటి సదుపాయాలు అందిస్తూ భవిత ఉపాధ్యాయులు బాసటగా నిలుస్తున్నారు. దీనిలో భాగంగా భవిత విద్యార్థుల సవాళ్ళు, సామర్థ్యాలను బట్టి బోధన చేయడంతో పాటు ఆటపాటలు, సాంకేతిక వనరుల సహాయంతో పిల్లలను క్రియాశీలకంగా ఉండే ప్రయత్నం భవిత ఉపాధ్యాయులు బి.దర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనంద రావు, ఐఇడిఎస్‌ఎస్ ఉపాధ్యాయిని ఎం.వీరభ వానిలు చేస్తున్నారు. ప్రతీ శుక్ర, శనివారాలలో భవిత ఉపాధ్యాయులు ఇంటిటికి వెళ్ళి ఫిజియోథెరపి సేవలు క్రమంగా అందజేయడంతో పాటు పిల్లలు తమ పనులు తామే చేసుకునేలా ఐఇఆర్‌పిలు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. వీరికి కూడా భవిత విద్యార్థుల తల్లితండ్రుల సహకారం ఎంతగానో ఉండడంతో విద్యార్థులలో ఆత్మసె ్థర్యంతో పాటు ప్రేరణ పొందడం జరుగుతుంది. ఐఇఆర్‌పిలు బి.దుర్గాప్రసాద్‌రెడ్డి, ఆనందరావులు ఇంటిటికి వెళ్ళి భవిత విద్యార్థులకు ఫిజియోథెరపి సేవలు అందజేస్తున్నారు. ఈ ఫిజియోథెరపి సేవలును ఎంఇఓ వి.ఆర్.కె.చౌదరి, ప్రతినిత్యం పరిశీలించి, భవిత ఉపాధ్యాయులకు పలు సూచనలు చేస్తున్నారు.

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 9వ తేది మంగళవారం ఉదయం పెద్దాపురం భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమం జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్షా అధికారులు, మండల విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు భవిత సహిత ఉపాధ్యాయులు బి.దుర్గాప్రసాద్‌రెడ్డి తెలిపారు.

# 10వ తరగతి విద్యార్థులకు, యు టిఫ్ స్టడీ మెటీరియల్ పంపిణి



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** వేట్లపాలెం కొండపల్లి గంగన్న మెమోరి యల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు రామకృష్ణ సమితి మరియు వివేకానంద ట్యుటోరియల్స్ వారు సౌజన్యంతో స్వామీ లోకమ యానంద రాజమండ్రి రామకృష్ణ మఠం వారిచే పెద్దాపురం క్రైమ్ సి ఎ అంకయ్య చేతుల మీదుగా పదో తరగతి విద్యార్థులకు, యు టిఫ్ ఇచ్చినటువంటి స్టడీ మెటీరియల్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుని పి అనురాధ వేట్లపాలెం వివేకానంద ట్రస్ట్ సభ్యులు కంటిపూడి గోపాల్ కృష్ణ, కంటిపూడి బలరాం మూర్తి వెంకటేశ్వర రావు హైస్కూల్ ఉపాధ్యాయులు నాగేశ్వర రావు పాల్గొన్నారు.

# మండలాల వారీగా GSWS సేవల సమగ్ర పర్యవేక్షణ



## కలెక్టరేట్‌లో ఒక రోజు శిక్షణా కార్యక్రమం -పి.వీణాదేవి

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టరేట్ పిజిఆర్‌ఎస్ సమావేశ మందిరంలో శనివారం జి ఎస్ డబ్ల్యూ ఎస్ వ్యవస్థలో అందిస్తున్న పౌర సేవలపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగిందనీ జిల్లా జి ఎస్ డబ్ల్యూ ఎస్ అధికారి పి వీణాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలియ చేశారు. గ్రామ-వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు చేరవలసిన సేవల అమలుపై ప్రాథమిక అంశాలను విపులంగా తెలియజేశారు.డివిజన్ పరిధిలో కొవ్వూరు, లాలాచెరువులలో డివిజన్ స్థాయి కార్యాలయాలు ప్రారంభించడం జరిగిందన్నారు. విధులు, బాధ్యతలపై సిబ్బందికి సూచనలు చేస్తూ పారదర్శకత,సమర్థత పెంపుదల లక్ష్యంగాఈకార్యక్రమం నిర్వహించినట్లు వీణా దేవి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జిఎస్‌డబ్ల్యూఎస్ కార్యకలాపాల పర్యవేక్షణ కోసం రూపొందించిన వివిధ డాష్‌బోర్డులు, ఆన్‌లైన్ సమీక్షా పద్ధతులపై కొండలరావు శిక్షణ ఇచ్చారు. ప్రజల అర్జీల స్వీకరణ నుంచి పరిష్కారం వరకు తీసుకోవలసిన చర్యలపై మార్గదర్శకాలు వివరించారు. పౌర సేవలన్నీ సమయానికి, నాణ్యతతో అందించేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం 21 మండలాల్లో 512 సచివాలయాలు కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయనీ. 4,067మంది సిబ్బంది ప్రజా సేవలందించడంలో భాగస్వామ్య మవుతున్నారు. జిల్లాలో 6,54,119 కుటుంబాలు,మొత్తం 18,32,965 మంది జనాభాకు సేవలందించేందుకు రూపొందించిన ఆన్‌లైన్ వ్యవస్థలపై సమీక్షించారు. ప్రజల వినతులు, ధృవీకరణ పత్రాలు, సంక్షేమ పథకాల అనుసరణ తదితర అంశాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. సచివాలయాల పనితీరు, ఉద్యోగులు &గృహాల వివరాల నివేదికలు, సచివాలయాల క్లస్టర్ అవలోకనం, హార్డ్‌వేర్ పంపిణీ&వినియోగం (వెబ్‌క్యామ్‌లు, హెడ్‌సెట్లు,FPస్కానర్లు, ఆధార్ కిట్లు), మరణ నమోదు ఆడిట్, అధిక భద్రత ఆధారిత సర్టిఫికెట్లు, EKYC తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్డేట్, వాహన్ ఆధార్ సీడింగ్, "తల్లికి వందనం" & ఆటో సేవలో చెల్లింపులు, వైఫల్య నివేదికలు, కౌశలం డేటా, వాట్సాప్ డోర్ టు డోర్ ప్రచారం, పాఠశాల తనిఖీ నివేదికలు, APసేవా చెల్లింపులు, సిబ్బంది హాజరు వంటి అంశాలను మండలాల వారీగా సేవల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జిఎస్‌డబ్ల్యూఎస్ ఇంచార్జి జిల్లా అధికారి పి.వీణాదేవి, కార్యాలయ సూపరింటెండెంట్ చిరంజీవి, జిల్లా కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, సహాయ కోఆర్డినేటర్ బాలకృష్ణ, ఏపీ ఆన్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ కొండలరావు,డివిజన్-మండల జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారులు,ఫంక్షనల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## అసోసియేషన్ అభ్యున్నతికు కృషి - అధ్యక్షుడు శ్రీనివాసులు



**అనపర్తి, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా అనపర్తి యూనిట్ ఏపీ ఎన్జీఓ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికల్లో పి శ్రీనివాస్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. ఎలక్షన్ ఆఫీసర్‌గా కే. నందీశ్వరుడు విధులు నిర్వర్తించాగా ప్రతి పదవికి ఒక్కో నామినేషన్ మాత్రమే రావడంతో ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిసినట్లు ఎలక్షన్ ఆఫీసర్ ప్రకటించారు. అధ్యక్షులుగా పి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా కే.వేంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కె.మంగ రాజు, కె.రమాకాంత రెడ్డి,జి.గంగాధర రావు, కార్యదర్శిగా కె.చంద్ర దీప్,సహాయ కార్యదర్శులుగా పి.నవీన్ కుమార్, ఏఎల్‌ఎన్ చైతన్య కె.తరుణ్, సహాయ కార్యదర్శిగా కే.దుర్గా భవానీ,కోశాధికారి:ఎం.సందీప్ కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన కొత్త కార్యవర్గ సభ్యులను తూర్పుగోదావరి జిల్లా అడ్‌హాక్ కమిటీ చైర్మన్ మీసాల మాధవరావు, కన్వీనర్ పి. అనిల్ కుమార్,కో-చైర్మన్ సేవా ప్రవీణ్ కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర జేఏసీ కార్యదర్శి వేణు మాధవరావు హాజరయ్యారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ మాట్లాడుతూ అసోసియేషన్ అభ్యున్నతకు కృషిచేస్తానని,ఏసమస్య ఉన్న పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో ధవళేశ్వర్ యూనిట్ అధ్యక్షులు జై కుమార్, సహాధ్యక్షులు ధర్మేంద్ర, ట్రెజరీ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు విజయకృష్ణ, రాజేష్, చటర్జీ మరియు తదితరులు పాల్గొని ఉన్నారు.

## త్వరలోనే దివ్యాంగుల కోసం కమ్యూనిటీ హాల్

**- మంత్రి కందుల దుర్గేష్**
**- దివ్యాంగుల సంక్షేమం కోసం కృషి చేస్తానని భరోసా**



**నిడదవోలు, మేజర్ న్యూస్ :** దివ్యాంగుల సంక్షేమం కోసం కృషి చేస్తారని, త్వరలోనే దివ్యాంగుల కమ్యూనిటీ హాల్ ను మంజూరు చేస్తామని మంత్రి దుర్గేష్ అన్నారు. ఆదివారం నిడదవోలు పట్టణంలోని చర్చిపేటలో జ్యోతిర్మయి దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 66వ ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ మాసోత్సవానికి మంత్రి దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి పలువురు దివ్యాంగులకు తినిపించారు. ఈ సందర్భంగా అన్ని అవయవాలు బాగుండి ఏమీ చేయలేని వారిని ఉదహరిస్తూ దివ్యాంగుడైన ర్యాలి శివ డాక్టరేట్ సాధించడం పట్ల మంత్రి దుర్గేష్ హర్షం వ్యక్తం చేసి సంబంధిత పత్రాన్ని అందించి ప్రశంసించారు. అనంతరం దివ్యాంగుల కోసం కృషి చేస్తున్న శివ చేస్తున్న కృషిని అభివర్ణిస్తూ ఘనంగా సత్కరించారు. శివ సాధించిన డాక్టరేట్ ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలుస్తుంది అన్నారు. అదేవిధంగా విభిన్న ప్రతిభావంతుల కోసం చేసిన సేవలను గుర్తిస్తూ మదర్ థెరిస్సా అవార్డు పొందిన వంగా కృపా వరప్రసాద్ ను మంత్రి దుర్గేష్ అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ దివ్యాంగుల కోసం కమ్యూనిటీ హాల్ కేటాయించలని పలువురు చేసిన విజ్ఞప్తి మేరకు తాను మున్సిపల్ అధికారులతో మాట్లాడాలని, అతి త్వరలోనే మంజూరు అవుతుందని భరోసానిచ్చారు. ఇప్పటికే రెండు మూడు గుర్తించామని, అందులో ఒకటి కేటాయిస్తామని స్పష్టం చేశారు. అందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం తరపున అవసరమైన అన్ని కార్యక్రమాలు చేపడతానని వెల్లడించారు. దివ్యాంగుల్లో అపారమైన శక్తి సామర్థ్యం, అంతులేని ఆత్మస్థైర్యం ఉంటుందని, అవకాశాలు ఇస్తే ప్రతి ఒక్కరు అద్భుతాలు సృష్టించగలరని వారిలో ధైర్యం నింపారు. దివ్యాంగులు సైతం అన్ని రంగాల్లో తమ ప్రతిభ కనబరుస్తూ రాణిస్తున్నారని పేర్కొన్నారు.

# తుని నియోజకవర్గంలో జనసేన జోరు

- భారీ సంఖ్యలో పార్టీలో చేరిన వీర మహిళలు
- పార్లమెంట్ సభ్యులు ఉదయ్ శ్రీనివాస్ స్ఫూర్తితో
- జనసేనలో పెరిగిన వీర మహిళల బలం
- కండువాలు కప్పి మహిళలను ఆహ్వానించిన నేత నల్లం శ్రీనివాస్



**తుని, మేజర్ న్యూస్ :** కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ సూచనలు, రాష్ట్ర ప్రోగ్రాం ఆర్గనైజింగ్ సెక్రటరీ నల్లం శ్రీనివాస్ ప్రోత్సాహంతో, తుని నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయం వీర మహిళల చేరికతో ఆదివారం సందడిగా మారింది. వీర మహిళ నాయకురాలు కసిరెడ్డి దుర్గా రత్నం ఆధ్వర్యంలో తుని పట్టణం నుండి భారీ సంఖ్యలో వీర మహిళలు జనసేన పార్టీలో చేరారు. జనసేన సిద్ధాంతాలకు ఆకర్షితులై, పార్టీ బలోపేతానికి కృషి చేసేందుకు వారు పార్టీలో చేరడం విశేషం. ఈ సందర్భంగా తుని నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు నూతనంగా పార్టీలో చేరిన వీర మహిళలను సాదరంగా ఆహ్వానించారు. వారికి పార్టీ జెండా కండువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి గౌరవించడం జరిగింది. ఈ చేరికల కార్యక్రమానికి సీనియర్ నాయకులు, జనసైనికులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు జనసేన పార్టీ సీనియర్ నాయకులు బోనం చినబాబు, దండెం రామకృష్ణ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అద్దేపల్లి బాలాజీ, డైరెక్టర్లు బొప్పన రాంబాబు, మగసాల శ్రీనివాస్, తొండంగి మండలం ప్రధాన కార్యదర్శి జి.నాగబాబు, కోటనందూరు మండల అధ్యక్షుడు పెనపాత్రుని శ్రీనివాస్, ఇతర నాయకులు వేగిశెట్టి వెంకటరమణ, తేజ, మూర్తి గురుస్వామి, కనిగిరి ప్రకాష్, రామరాజు, వినాయకమ్మ, చిన్నారి, జవాదుల నాగేశ్వరరావు, నాగూరు తదితరులు పాల్గొన్నారు. వీర మహిళల చేరికతో తుని నియోజకవర్గంలో జనసేన పార్టీ మరింత బలోపేతం అవుతుందని రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేస్తామని నియోజకవర్గ నాయకులు ఈ సందర్భంగా ప్రకటించారు.

# చిత్తూలాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులు అరెస్ట్

- ఎస్సై శివకుమార్



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్:** రాజవొమ్మంగి గ్రామ శివారు చిత్తులాటాడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్సై శివకుమార్ తెలిపారు. పంచాయతీకి చెందిన శాంతినగర్ శివారు ప్రాంతంలో ఆదివారం కొందరు వ్యక్తులు చిత్తులాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో వెళ్లి దాడి చేసి ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయడం జరిగిందన్నారు. వారి వద్ద నుండిరూ 3000 నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అలానే నలుగురు వ్యక్తులు పరారు కాగా వారిపై కేసు నమోదు చేసి ముద్దాయిల కోసం గాలిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్,రంపచోడవరం డిఎస్పి జి.ఎస్ ప్రశాంత్ ఆదేశాల మేరకు రాజవొమ్మంగి సీఐ గౌరీ శంకర్ సూచనలతో దాడి చేయడం జరిగిందని ఎస్ఐ శివకుమార్ మీడియాకు తెలిపారు.

# భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం



- మంత్రి కందుల దుర్గేష్
- డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించిన మంత్రి దుర్గేష్
- కేవీపీఎస్ చర్చ్ పేట యూత్ ఆధ్వర్యంలో 200 మందికి దుప్పట్లు పంపిణీ చేసిన మంత్రి దుర్గేష్

**నిడదవోలు, మేజర్ న్యూస్ :** భారత రత్న, రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోగలిగితే అదే ఆయనకు నిజమైన నివాళి అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని (డిసెంబర్ 6) పురస్కరించుకొని కేవీపీఎస్ చర్చ్ పేట యూత్ పెద్దల ఆధ్వర్యంలో నిడదవోలు చర్చ్ పేట డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు, న్యాయవాది జువ్వల రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి మంత్రి కందుల దుర్గేష్ పూల మాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. నిరంతరం నిడదవోలు పరిశుభ్రత కోసం పాటు పడుతున్న పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనిది అని,అంబేద్కర్ విగ్రహం ముందు వారిని సన్మానించడం తనకు సంతృప్తినిచ్చిందని మంత్రి దుర్గేష్ అన్నారు. అనంతరం జ్యోతిర్మయి దివ్యాంగుల సంక్షేమ సంఘం సభ్యులకు, చర్చ్ పేట ఒంటరి మహిళలకు, వృద్ధులకు శ్రీ బూరుగుపల్లి లక్ష్మీపతి గారి జ్ఞాపకార్థం మరికొంత మంది దాతల సహకారంతో 200మందికి చలి దుప్పట్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా కేవీపీఎస్ చర్చ్ పేట యూత్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీ నేషనల్ హెల్త్ మిషన్ నాయకులు, సీఐటీయు నాయకులు కామ్రేడ్ దిద్దే దయామణి, సీఐటీయు నాయకులు కామ్రేడ్ గంటి కృష్ణ జీ డానియల్, జగ్జీవన్ రామ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు బైపే రాజేశ్వర రావు, జన విజ్ఞాన వేదిక నాయకులు పైడియ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు టీ చిరంజీవి, బి.నాగేశ్వర రావు డి.సుబ్రహ్మణ్యం, పెయింటర్స్ యూనియన్ నాయకులు పి చినబాబు, యు. ప్రభాకర్, టీ ముత్యాల రావు, టీ సుధాకర్, గండి శేఖర్ యూత్ నాయకులు టీ నానీ, టీ నంగాల రాజు, లెనిన్ దాకే కృష్ణ,యు. మోషే సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సైనికులపై " విరాళాల భారం " తగదు

- ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలి
- దేశ రక్షణలో జీవితాన్ని అంకితం చేసిన వారిని బిచ్చగాళ్లుగా మార్చవద్దు

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** మాజీ సైనికుల సంక్షేమ కార్యక్రమాల కోసం మాజీ సైనికుల నుంచే నిధుల సేకరణను నిలిపివేయాలనే వినతి ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చారు మోహన్‌రావు. దేశరక్షణ కోసం తమ జీవితంలో 20-25 సంవత్సరాలు సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెట్టిన మాజీ సైనికుల సంక్షేమ నిధుల కోసం వారినే విరాళాలు కోరడం లేదా నిధులు సేకరించడానికి నియమించడం అత్యంత అవమానకరమని మాజీ సైనికుల సంఘం మోహన్‌రావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మాజీ సైనికుల సంక్షేమ కార్యక్రమాల కోసం మాజీ సైనికుల నుంచే విరాళాలు కోరడాన్ని తక్షణమే నిలిపివేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ ప్రజల ముంగిటకు వినతిపత్రం సమర్పించారు. సరిహద్దుల హీరోలకు ఈ అవమానం ఎందుకు..? అనే నినాదంతో మోహన్‌రావు మాట్లాడుతూ " ఒక వ్యక్తి సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెట్టి సేవ చేసి, రిటైర్ అయిన తరువాత అదే తన తోటి మాజీ సైనికుల సంక్షేమం కోసం ఇంటింటికి తిరిగి విరాళాలు అడగాల్సిన అవస్థకు రావడం దేశం పట్ల చేసిన సేవకు దక్కిన అవమానం కాదా..? ఇది వారి గౌరవాన్ని దెబ్బతీసే చర్య. దేశంలో ఏ మైనారిటీ కమ్యూనిటీ సంక్షేమం కోసం కూడా వారినే విరాళాలు అడగడం లేదు. దేశ రక్షణ కోసం ప్రాణాలు పెట్టిన మాజీ సైనికులకు ఇలాంటి దుస్థితి రావడం మరింత బాధాకరం " అని తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు.

-తక్షణమే అమలు చేయాల్సిన ముఖ్య కోరికలు

ఈ విపరీత భారాన్ని, అవమానాన్ని నిలిపివేయడానికి ప్రభుత్వం తక్షణమే ఈ క్రింది చర్యలు తీసుకోవాలని మోహన్‌రావు వినమ్రంగా కోరారు.

-విరాళాలు నిలిపివేత

మాజీ సైనికుల వద్ద నుంచి లేదా వారి ద్వారా విరాళాలు కోరడాన్ని వెంటనే నిలిపివేయాలి.

-నిధుల సేకరణకు నియామకం వద్దు

నిధుల సేకరణ ప్రక్రియల కోసం మాజీ సైనికులను ఎట్టి పరిస్థితుల్లోనూ నియమించరాదు.

-ప్రభుత్వ నిధులే ఆధారం

మాజీ సైనికుల సంక్షేమ కార్యక్రమాలు ప్రభుత్వ బడ్జెట్ నిధులు లేదా అధికారిక అభివృద్ధి నిధుల ద్వారా మాత్రమే నిర్వహించాలి.

-గౌరవ మార్గదర్శకాలు

మాజీ సైనికుల గౌరవాన్ని కాపాడే స్పష్టమైన, కఠినమైన మార్గదర్శకాలను తక్షణమే అమలు చేయాలి. మాజీ సైనికుల త్యాగాలు, దేశం పట్ల వారి నిబద్ధత వెలకట్టలేనివి. ఈ విషయాన్ని ప్రభుత్వం దయతో పరిగణించి, వారి గౌరవాన్ని కాపాడే చర్యలు తీసుకుంటుందని మోహన్‌రావు అన్నారు. మాజీ సైనికుల సంఘాన్ని సంప్రదించండి.

# ఆదివారం మహాదేవునికి పంచామృత అభిషేకాలు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మార్గశిర మాసంలో ఆరుద్ర నక్షత్రం అతి శక్తివంతమైన రోజు ఆదివారం పరమశివునికి ఇష్టమైన నక్షత్రం కావడంతో తెల్లవారుజామున ఆ మహా దేవునికి పంచామృత అభిషేకాలు పురోహితులునిర్వహించారు. అలానే కార్తీక మాసంలో మహా శివునికి అభిషేకం చేయనివారు ఆరుద్ర నక్షత్రం రోజున పంచామృత అభిషేకం చేయించితే రెట్టింపు పుణ్యం కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. మండలంలోనిరాజవొమ్మంగి, జడ్డంగి తదితర శివాలయాల్లో భక్తులు బారులు తీరి పంచామృత అభిషేకాన్ని తిలకించారు. హర హర మహాదేవ శంభో శంకర అంటూ, ఓం నమశ్శివాయ అనే పంచామృత నామాన్ని జపించారు.

# కానూరు శ్రీ కొండాలమ్మ తల్లి అమ్మవారి దేవస్థాన కమిటీ ప్రమాణ స్వీకారం

– ముఖ్యఅతిథిగా మంత్రి దుర్గేష్



**పెరవలి, మేజర్‌న్యూస్ :** డిసెంబర్ 7వ తేదీ ఆదివారం పెరవలి మండలం కానూరు గ్రామంలో కొలువైన శ్రీ కొండాలమ్మ తల్లి అమ్మవారి ఆలయం నందు ఆలయ నూతన చైర్మన్,ధర్మకర్తల ప్రమాణ స్వీకార మహోత్సవంలో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మంత్రి కందుల దుర్గేష్ ను ఘనంగా సత్కరించారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్ సమక్షంలో శ్రీ కొండాలమ్మ దేవస్థానం కమిటీ చైర్మన్‌గా బొబ్బిలి దుర్గారావు, డైరెక్టర్లుగా టి.దుర్గాదేవి, టి. ఆంజనేయులు, కే.దొరబాబు, జె.శ్రీను, బి.నాగ త్రివేణి, టి సీతా రామలక్ష్మి, భావన ధర్మ శేఖర్, పెద్దింటి విజయలక్ష్మి, డివివి రమణ( అర్చక ఎక్స్ అఫీషియో మెంబర్ ) తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ అభివృద్ధితోపాటు, సేవా కార్యక్రమాలు చేయాలని, ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందేందుకు దేవస్థాన కమిటీ కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంతో ప్రాశస్త్యమున్న ఈ ఆలయ అభివృద్ధికి, దేవస్థానం కమిటీకి మంత్రిగా సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ కోరిన వారికి కొంగు బంగారంగా నిలిచే తల్లి కొండాలమ్మ తల్లి అన్నారు. స్థానిక ప్రజల కోరిక మేరకు ఎన్నికలకు ముందు కొండాలమ్మ దర్శనం చేసుకున్న తాను అమ్మ ఆశీర్వాదం, ప్రజల అభిమానంతో ఎమ్మెల్యేనై అనంతరం మంత్రిని అయ్యానన్నారు. సౌమ్యుడు, దాన గుణం ఉన్న వ్యక్తి బొబ్బిలి దుర్గారావు దేవస్థాన కమిటీ చైర్మన్ గా పనిచేసేందుకు నూటికి నూరు శాతం అర్హులని మంత్రి దుర్గేష్ ప్రశంసించారు. రాబోయే రోజుల్లో కానూరు గ్రామాన్ని, నిడదవోలు నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు. ప్రస్తుతం కానూరు– ఉసులుమర్రు రోడ్డు సీసీ రోడ్డు పనులు ప్రారంభించామని, అదే రోడ్డు పనులను పెరవలి వరకు పొడిగించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 16 నెలల కాలంలో రూ. 3 కోట్ల పై చిలుకు ముఖ్యమంత్రి సహాయ నిధులు (సీఎంఆర్ఎఫ్) నియోజకవర్గ ప్రజలకు అందించామని, మరీ ముఖ్యంగా కానూరు గ్రామానికి అత్యధికంగా అందించినట్లు మంత్రి వెల్లడించారు. ప్రజా రాజధాని అమరావతిని గత ప్రభుత్వం పూర్తిగా నాశనం చేసిందని మంత్రి దుర్గేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వ నేతలు నీరుగార్చారన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమర్థత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో తిరిగి రాజధాని అమరావతి నిర్మాణం చేపట్టామని, పోలవరం ప్రాజెక్టును పట్టాలెక్కించామని మంత్రి దుర్గేష్ వివరించారు. వాటిని పూర్తి చేసే బాధ్యత కూటమి ప్రభుత్వానిదని అన్నారు. టిడిపి, బిజెపి, జనసేన మూడు పార్టీల కలయికతో రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ పరుగులు పెడుతోందన్నారు. కూటమిలో అందరూ ఐకమత్యంగా ఉండి రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధికి కారకులవ ుదామన్నారు. నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, అడిగిన వెంటనే రాష్ట్రంలోనే తొలిసారి నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ. 11 కోట్లు విడుదల చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో పంచాయతీరాజ్ శాఖ ద్వారా నిడదవోలు నియోజకవర్గానికి మరిన్ని నిధులు తీసుకొస్తానని హామీ ఇచ్చారు.

తద్వారా నియోజకవర్గంలో పుంత రోడ్లు, డ్రైన్లు నిర్మాణం చేపడతామన్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఆర్ అండ్ బి నిధులతో చేపట్టిన చివటం రోడ్డును చూసి స్థానిక ప్రజలు ధన్యవాదాలు చెప్పారన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినప్పుడు, అది ప్రజలకు సత్ఫలితాలు అందించినప్పుడే రాజకీయ నాయకుడిగా తమకు సంతృప్తి కలుగుతుందని అన్నారు. నిడదవోలు మున్సిపాలిటీకి స్పెషల్ గ్రేడ్ హోదా ఇచ్చిన మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ కు కృతజ్ఞతలు చెబుతూ త్వరలోనే ఆ హోదాలో పట్టణ అభివృద్ధికి భారీగా నిధులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే ఆర్ఓబి నిర్మాణం పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు క్యాబినెట్లో మంత్రిగా పనిచేయడం తనకు దొరికిన అదృష్టమని మంత్రి దుర్గేష్ అన్నారు.

# భారతదేశం ప్రపంచానికి తలమాణికం

– ఎమ్మెల్సీ సోము వీర్రాజు



**గోపాలపురం,మేజర్‌న్యూస్ :** ప్రపంచంలోనే గొప్ప ఆధ్యాత్మిక దేశం భారత్ అని ఎమ్మెల్సీ సోము వీర్రాజు కొనియాడారు.ఇస్కాన్ భగవద్గీత పాఠశాల లెర్న్ గీత లీవ్ గీత కో–ఆర్డినేటర్ వెలగ కళ్యాణి ప్రసాద్ ఆధ్వర్యంలో గీతా జయంతి మహా మహోత్సవాన్ని పురస్కరించుకొనిభగవద్గీతపై శ్లోకపఠన,క్విజ్‌పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతుల ప్రధాన కార్యక్రమం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో ఆదివారం సాయంత్రం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సోము వీర్రాజు మాట్లాడుతూ ఎంతో ప్రాచీనమైన చరిత్ర కలిగిన ఏకైక దేశం భారత్ అని పొగిడారు.మనమంతా భారతదేశంలో పుట్టడం పూర్వజన్మ సుకృతంగా అభివర్ణించారు.ఈ దేశంలో పుట్టిన ఎంతో మంది మేధావులు దేశ విదేశాలలో గొప్ప ఉన్నతమైన స్థితిలో ఉన్నారంటే దానికి ప్రధాన కారణం భరత గడ్డమీద జన్మించడమే అన్నారు. భగవద్గీతకు, వేదాలు వంటి పవిత్ర ఆధ్యాత్మిక గ్రంథాలకు నిలయం మన దేశమని భగవద్గీత మానవుని దయానందిక జీవితానికి సంబంధించిన సత్యాలను విశదీకరిస్తుందన్నారు. ప్రపంచంలోని కొన్ని దేశాలు భారత్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నా ప్రధాని మోదీ శాంతియుతంగా ఉండడానికి ప్రధాన కారణం భగవద్గీతలోని కొన్ని నిజ సత్యాలను గ్రహించి వాటి ఆధారంగా పాలన సాగించడమే అన్నారు. ఎంతోమంది మహానుభావులు భగవద్గీతను చదివి అందులోని సారాన్ని గ్రహించి ప్రపంచ దేశాలకు వెళ్లి తాము గడిచిన అద్భుత జ్ఞానాన్ని ఆ దేశ వాసులకు తెలియజేసి వారిలో ఆధ్యాత్మిక భావాన్ని కలగ చేస్తున్నారంటే దానికి ప్రధాన కారణం భగవద్గీత గొప్పతనం అన్నారు.భరతమాత ముద్దుబిడ్డలైన అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ బాలగంగాధర్ తిలక్ గాంధీజీ పొట్టి శ్రీరాములు ఝాన్సీ లక్ష్మీబాయి మహోన్నతమైన వ్యక్తులు భగవద్గీతను నిత్యం పారాయణం చేసిన వారే అన్నారు. భగవద్గీతను అభ్యసించడం కారణంగానే వారు గొప్ప వ్యక్తులుగా పేరు ప్రఖ్యాతలు గాంచరన్నారు.మారుమూల వాదాలకుంట గ్రామానికి చెందిన కళ్యాణి ప్రసాద్ దంపతులు ఇస్కాన్ ఆధ్వర్యంలో ఇటువంటి ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు.తాము ఇంట్లోనే ఉంటూ భజనలు చేస్తూ సంకీర్తనలు పాడుతూ ఉండటమే కాకుండా బయట ప్రపంచానికి భగవద్గీత యొక్క గొప్పతనాన్ని శ్రీకృష్ణ భగవానుడు తెలియజేసిన సత్యాన్ని ప్రజలకు వివరించి వారిని చైతన్యవంతులు చేయడం అభినందనీయం అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ మానవ మనుగడకు ఆధారం భగవద్గీత అని అన్నారు. భగవద్గీత నిత్యం పారాయణం చేయడం వలన ఎన్నో జన్మల పుణ్యం లభిస్తుందన్నారు.మానవ జన్మ సార్ధకం కావాలంటే నిత్యం పారాయణం చేయాలన్నారు. అనంతరం నిర్వాహకులు కళ్యాణి ప్రసాద్ మాట్లాడుతూ పూజ్య గురువులు లీలా పురుషోత్తమ ప్రభుజి వంటి మహోన్నతమైన వ్యక్తుల ఆశీస్సులతో తాము గ్రామ గ్రామాల్లో అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. భగవద్గీత పోటీలకు సంబంధించి కొయ్యలగూడెం దేవరపల్లి తాళ్లపూడి కొవ్వూరు తదితర మండలాలు పర్యటించి వివిధ విద్యా సంస్థలలోని విద్యార్థులను చైతన్య పరిచామన్నారు. కార్యక్రమంలో భాగంగా విజేతలకు, పోటీల్లో పాల్గొన్నవారికి అతిథి సోము వీర్రాజు చేతుల మీదుగా నగదు, ప్రశంసా పత్రాలను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు పిల్లి వెంకటేశ్వరరావు నాయకులు పెనుమత్స రంగరాజు, ఇల్లూరి పెంటల రాజు, గెల్లా శ్రీనుబాబు, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# లయనిజానికి తీరని లోటు..

# ఒంటెద్దు సోమసుందర్రావు మృతి

– ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

– జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు



**పెరవలి, మేజర్ న్యూస్ :** పైడిపర్రు తేతలి లయన్స్ క్లబ్ ఫౌండర్ అండ్ చార్టర్ ప్రెసిడెంట్, ప్రముఖ వ్యాపారవేత్త హీరో మోటార్స్ షోరూమ్ అధినేత లయన్ ఒంటెద్దు సోమసుందర్రావు మృతి లయనిజానికి సేవా రంగానికి తీరని లోటు అని శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ అన్నారు. డిసెంబర్ 7వ తేదీ ఆదివారం పైడిపర్రు తేతలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్ ఒంటెద్దు సోమసుందర్రావు సంస్మరణ సభ హీరో షోరూం ఆవరణలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ హాజరై సోమసుందర్రావుకు ఘననివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ చిరు వ్యాపారి స్థాయి నుండి అంచలంచలుగా కష్టపడి పైకి వచ్చి అద్భుతమైన వ్యాపారవేత్తగా నిలిచిన సోమసుందర్రావు ఎందరికో ఆదర్శనీయుడు అన్నారు. జిల్లా లోని చాలా లయన్స్ క్లబ్ లకు ఆయన చీఫ్ సేవా కోఆర్డినేటర్ గా సహాయం అందించారని ఆయన చొరవతో తాను పెరవలి మండలం లయన్స్ క్లబ్, పెనుగొండ లయన్స్ క్లబ్ స్థాపించానని అన్నారు. కష్టపడి పనిచేసే వారందరినీ ఆయన ఇష్టపడే వారని ఆయన ఎందరికో మార్గదర్శిగా నిలిచారని అన్నారు. ఆయన లేని లోటు తీర్చలేనిది అని ఆయన ఆశయాలను వారి కుటుంబ సభ్యులు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమానికి 316 జి లయన్స్ గవర్నర్ ఎన్ పాపారావునాయుడు, పిడిజిలు మాదిరెడ్డి బాబుజీరావు, దామెర రంగారావు, ఎంవీఎస్ రాజు, లయన్స్ లీడర్స్ సభ్యులు వంక రాజకుమారి, అరుణ, నందుల రమణి, పుట్ట విజయశ్రీ, డాక్టర్ కుడారి ఆనంద్, గాజుల రంగారావు, కుంకట్ల వెంకట రత్నం, జవ్వాది తమ్మయ్య నాయుడు, చీకట్ల వెంకటేశ్వరరావు, నందుల సీతారామారావు, ఒంటెద్దు గోవిందు, శ్రీకాకుళపు కామేశ్వరరావు, కార్మూరి రామలింగే శ్వరరావు తదితరులతో పాటు భారీ సంఖ్యలో అభిమానులు లయన్స్ క్లబ్బుల సభ్యులు పాల్గొన్నారు.

# కిరణ్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థచే ఉచిత నేత్ర వైద్య శిబిరం



**సామర్లకోట, మేజర్ న్యూస్:** సామర్లకోట మండలం హుస్సేన్ పురం గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం కిరణ్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వారిచే ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని పెద్దాపురం నియోజవర్గం జనసేన పార్టీ అధ్యక్షులు తుమ్మల రామస్వామి (బాబు) తెలుగుదేశం పార్టీ యువ నాయకులు నిమ్మకాయల రంగనాథ్ (బాబి) చేతులు మీదుగా ప్రారంభించడం జరిగినది. ఈ శిబిరంలో హుస్సేన్ పురం పరిసర గ్రామాల్లో ప్రజలు మరియు గ్రామ ప్రజలు సుమారుగా 120 మంది కంటి పరీక్షలు చేయించుకోగా అందులో 30 మందికి ఆపరేషన్ ఉచితంగా చేయబడును. మరియు కొంతమందికి కళ్ళజోడులు వేయబడును. అలాగే మరికొందరికి మందులు ఉచితముగా ఇవ్వడం జరిగినది.ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షులు చల్లా బుజ్జి, కూటమి నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.